www.dainamicnews.com
శుభోదయ
# డైనమిక్
dianamicnews Tv
dianamicnews.epaper.com
ప్రజల కోసం - ప్రగతి కోసం

విలేకరులు కావలెను
తెలుగు రాష్ట్రాలలో వెలువడుతున్న
డైనమిక్ దినపత్రికలో
అన్ని మండలాల వారీగా
విలేకరులు కావలెను.
డైనమిక్
CELL : 96523 03089

తెలంగాణా- ఏపి | సంపుటి : 1 | సంచిక : 175 | పేజీలు : 4 | ఎడిటర్ : పర్వతం పరమేష్ | గురువారం 1 అక్టోబర్ 2026 | వెల : 4/-

## రబీ పంటల కనీస మద్దతు ధరలు పెంపు



- కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం
- మద్దతు ధర పెంచాక రూ.2,610కు చేరిన క్వింటా గోధుమలు
- ఢిల్లీలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు
- ఢిల్లీ ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఏఐ సాయం తీసుకుంటామన్న అశ్వినీ వైష్ణవ్

## రష్యా సైన్యంలో చేరొద్దు.. అది చాలా ప్రమాదకరం!



- భారతీయులకు కేంద్రం తీవ్ర హెచ్చరిక
- డబ్బు ఆశతో ప్రమాదకర మార్గంలో వెళ్లొద్దని సూచన
- పౌరసత్వం వదులుకుని మరీ కొందరు సైన్యంలో చేరుతున్నారని ఆందోళన
- ఇప్పటివరకు 139 మందిని సురక్షితంగా వెనక్కి రప్పించినట్లు వెల్లడి
- మిగిలిన వారిని రప్పించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి




## ప్రపంచ శాంతిపైనా ఫోకస్!

- ట్రంప్- మోదీ ఫోన్ సంభాషణ
- వాణిజ్యం నుంచి రక్షణ వరకు కీలక అంశాలపై చర్చ
- ఫోన్‌లో మాట్లాడుకున్న భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్
- ద్వైపాక్షిక సహకారం, వాణిజ్య అంశాలపై సమీక్ష
- అంతర్జాతీయ పరిణామాలు, ప్రపంచ శాంతి భద్రతలపైనా చర్చలు!



## నిరాశ మిగిల్చిన 'నైరుతి'

- కురవని వానలు, నిండని జలాశయాలు
- ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ఆలస్యంగా ప్రవేశించాయి
- రాష్ట్రంలో కేవలం 601.8 మి.మీ. మాత్రమే వర్షాలు కురిశాయి
- లోటు వర్షపాతం కారణంగా గోదావరి, కృష్ణా బేసిన్‌లలోని ప్రాజెక్టులు అరకొరగా నిండాయి.

**హైదరాబాద్**

రాష్ట్రంలో ఈ సంవత్సరం నైరుతి రుతుపవనాలు నిరాశనే మిగిల్చాయి. ఈ ఏడాది ఆలస్యంగా జూన్? పదో తేదీ తర్వాత రాష్ట్రంలోకి ప్రవేశించాయి. కానీ ఎల్‌నినో ప్రభావంతో మేఘాలు తేలిపోయాయి. తెలంగాణలో సాధారణ వర్షపాతం 728.3 మి.మీ. కాగా కేవలం 601.8 మి.మీ. మాత్రమే కురిసింది. దీంతో సుమారు 17% లోటు వర్షపాతం నమోదైంది. కీలకమైన - మిగతా3లో

# సిరిసిల్ల గడిని నేలమట్టం చేద్దాం



- ఇదే మన ప్రతిజ్ఞ : రేవంత్ రెడ్డి
- సిరిసిల్లలో కేటీఆర్ గడ్డపై అడుగుపెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన హవా ప్రదర్శించారు
- భారీ ఎత్తున పాదయాత్రతో ర్యాలీగా వెళ్లి బహిరంగ సభలో గులాబీ నేతలపై విమర్శల బాణాలు కురిపించారు.
- మీ కుటుంబాలను ఆదుకోవడానికి అణాపైసా సాయం చేయలేదు
- ఒక్క రోజైనా కేసీఆర్ కుటుంబం మీ గురించి ఆలోచన చేసిందా?

**హైదరాబాద్**

ముఖ్యమంత్రి హోదాలో సిరిసిల్లలో రేవంత్ రెడ్డి పర్యటన ఉత్సాహంగా సాగింది. కేటీఆర్ అడ్డాలో తమ బలాన్ని నిరూపించేలా కీలక నేతలు, శ్రేణులు, నేతన్నలతో సీఎం మూడు కిలోమీటర్ల మేర పాదయాత్ర చేశారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు లక్ష్యంగా కొంతకాలంగా పదునైన ఆరోపణలు చేస్తూ వస్తున్న రేవంత్ రెడ్డి ఇవాళ తన విమర్శలు పదును మరింత పెంచారు. సిరిసిల్ల వాసులకు జరిగిన అన్యాయం, బీఆర్?ఎస్ పాలనతో జరిగిన నష్టాన్ని వివరిస్తూ జోరుగా విమర్శలు ఎక్కుపెట్టారు. బహిరంగ సభకు భారీ ఎత్తున తరలివచ్చిన పార్టీ కార్యకర్తలు, స్థానికులు, జిల్లా వాసులతో సిరిసిల్ల గడ్డపై కాంగ్రెస్ జెండాను ఎగురవేసిన మొనగాడిని మంత్రివర్గంలోకి తీసుకోవాలని మనసులో మాట వెల్లడించారు. సిరిసిల్ల చేనేత కష్టాలు, కాళేశ్వరం ముంపు సమస్యలను ప్రధానంగా ప్రస్తావిస్తూ రేవంత్ రెడ్డి ప్రసంగం సాగింది. 2009 నుంచి కేటీఆర్‌ను సిరిసిల్ల ప్రజలు గెలిపించారని, అయినా ఆయన నేతన్నల ఆత్మహత్యలను ఆయన ఎందుకు ఆపలేకపోయారని, గల్ఫ్‌కు వలసపోతున్న కార్మికులను ఎందుకు ఆపలేకపోయారని నిలదీశారు. మీ కుటుంబాలను ఆదుకోవడానికి అణాపైసా - మిగతా3లో



## ఎన్నికల సంఘం పనితీరుకు నిరసనగా 2న 'జైల్ భరో'

- అభిజిత్ దిప్కే పిలుపు
- జైల్ భరో ఆందోళన్ నిరసన కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీలు పాల్గొనాలని దీప్కే విజ్ఞప్తి
- అక్టోబర్ 4న ఠాక్రే సోదరుల భారీ మార్చ్

## ప్రజలకు ఎన్ని చట్టాలు చేసినా నిధులు ఇచ్చినా చేరవేయాల్సింది

# ఉద్యోగులే

- సమస్యల పరిష్కారానికి కేంద్రం వద్దకు ఎన్ని సార్లయినా వెళ్లాల్సిందే
- మూడు శాతం ఉద్యోగులు 97 శాతం ప్రజలకు సేవ చేయడం శ్రమతో కూడిన పని
- కరీంనగర్ సమీకృత కలెక్టరేట్ ఎదుట తెలంగాణ తల్లి విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు.
- ప్రభుత్వ ఉద్యోగులే సేవలందిస్తున్నారు
- ప్రభుత్వానికి మంచి పేరు వచ్చినా, చెడు పేరు వచ్చినా ప్రభుత్వ ఉద్యోగుల వల్లే
- సమస్యల పట్ల ఉద్యోగులు నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వం సరిగా పని చేయట్లేదంటారు



**కరీంనగర్**

పేదల సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ కార్యాలయం ఉపయోగపడాలని, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరాలంటే ఉద్యోగులే ప్రభుత్వ ప్రతినిధులని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సహాయం కోసం వచ్చిన వాళ్లను మన కుటుంబసభ్యుల్లా చూడాలని కోరారు. కరీంనగర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించారు. కరీంనగర్ సమీకృత కలెక్టరేట్ ఎదుట తెలంగాణ తల్లి విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు. కరీంనగర్ కలెక్టరేట్ నూతన భవన - మిగతా3లో




## ఈసీపై 'ఇండియా' కూటమి సమరశంఖం

- దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపు
- అక్టోబర్2 నుంచి 'సేవ్ డెమోక్రసీ' యాత్ర
- సీఈసీ రాజీనామా చేయాలని నేతల డిమాండ్
- ఉద్యమ కార్యాచరణను ఖరారు చేసిన ఇండీ కూటమి
- అక్టోబర్ 6న ఈసీ కార్యాలయం వరకు విపక్ష ఎంపీల ప్రదర్శన
- సర్ ప్రక్రియకు ముందున్న ఓటర్ల జాబితానే పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేసిన కూటమి

# నేడు తెలంగాణ కేబినెట్ సమావేశం

- ప్రధానాంశం కానున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం
- సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన నేడు తెలంగాణ కేబినెట్ సమావేశం జరగనుంది
- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం సహా, పాలిటెక్నిక్‌లు, రాజీవ్ యువవికాసం, మెట్రో ప్రాజెక్టు అంశాలు చర్చకు రానున్నట్లు సమాచారం.
- తెలంగాణ మంత్రివర్గ విస్తరణ మరింత జాప్యమయ్యే అవకాశాలు



**హైదరాబాద్**

తెలంగాణ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం(అక్టోబర్ 1న) సాయంత్రం 3 గంటలకు రాష్ట్ర మంత్రిమండలి సమావేశం జరగనుంది. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రెండు డీఏల మంజూరుతో పాటు మరికొన్ని కీలక అంశాలపై కేబినెట్ నిర్ణయం తీసుకోనుంది. ఉద్యోగులు, పెన్షనర్లకు మొదటి డీఏ 3.64 శాతం, రెండో డీఏ 2.74 శాతం మంజూరు చేసేందుకు మంత్రివర్గం ఆమోద ముద్ర వేయనుంది. డిసెంబరు నెలలో జరగనున్న గ్లోబల్ సమ్మిట్ నిర్వహణపై కేబినెట్ చర్చించనున్నట్టు తెలుస్తోంది. ఇందిరమ్మ కుటుంబ జీవితబీమా పథకం విధివిధానాలపై చర్చించే అవకాశం ఉంది. కుటుంబ - మిగతా3లో

# ప్రపంచ శాంతిపైనా ఫోకస్!

భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం రోజు ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా భారత్– అమెరికా ద్వైపాక్షిక సంబంధాల్లో జరుగుతున్న పురోగతిని ఇరువురు నేతలు సమీక్షించారు. ఈ సంభాషణలో ముఖ్యంగా ఇరు దేశాల మధ్య వాణిజ్యం, రక్షణ, ఇంధనం, అత్యంత కీలకమైన సాంకేతికతలు తదితర రంగాల్లో పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన సహకారంపై చర్చించారు. ఇదే సమయంలో ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలు, ప్రపంచంలో శాంతి భద్రతల్ని పెంపొందించడానికి జరుగుతున్న ప్రయత్నాలపై మోదీ–ట్రంప్ తమ అభిప్రాయాలను వెల్లడించారు. ట్రంప్‌తో ఫోన్ కాల్ గురించి ప్రధాని మోదీ స్వయంగా సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. “అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ఫలవంతమైన సంభాషణ జరిగింది. వాణిజ్యం, రక్షణ, ఇంధనం, క్రిటికల్ టెక్నాలజీతో పాటు పరస్పర ప్రయోజనాలు ఉన్న అనేక రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని సమీక్షించాం. మా సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి నిరంతరం కలిసి పనిచేయాలని నిర్ణయించాం.”

ట్రంప్– మోదీ సంభాషణ గురించి భారత ప్రధాన మంత్రి కార్యాలయం (పీఎంఓ) కూడా ఒక ప్రకటన విడుదల చేసింది. దీని ప్రకారం భారత్– అమెరికా సంబంధాల్ని మరింత విస్తృతం చేయడంపైనే ప్రధానంగా చర్చ సాగింది. వాణిజ్య సంబంధాలు, రక్షణ భాగస్వామ్యం, క్లిష్టమైన, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానంపై సహకారాన్ని సమీక్షించినట్లు వెల్లడించింది. భారత్ అమెరికా సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని (కాంప్రెహెన్సివ్ గ్లోబల్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్) మరింత బలోపేతం చేసి, ఇరు దేశాల ప్రజల ప్రయోజనాల కోసం నిరంతరం సంప్రదింపుల్ని




కొనసాగించేందుకు ఇరు దేశాలు అంగీకరించాయని పీఎంఓ తన ప్రకటనలో పేర్కొంది.

**ట్రేడ్ డీల్ కోసం చర్చలు**

భారత్– అమెరికా మధ్య ఇప్పటివరకు పూర్తి స్థాయిలో వాణిజ్య ఒప్పందం కుదరలేదు. పరస్పర ప్రయోజనకరంగా ఉండేలా ట్రేడ్ డీల్‌ను ఖరారు చేసేందుకు పలు దఫాలుగా ఉన్నత స్థాయి అధికారుల మధ్య చర్చలు జరుగుతూనే ఉన్నాయి. భారత్ నుంచి కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ నేతృత్వంలో ప్రతినిధులు అమెరికాకు వెళ్లడం, అక్కడి నుంచి ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందం భారత్‌లో పర్యటించి చర్చలు జరపడం ఇలా ఎన్నో జరిగాయి. మరోవైపు భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఇటీవల అమెరికాలో దీని గురించి మాట్లాడారు. వాణిజ్య ఒప్పందంపై ఇరు దేశాల మధ్య దాదాపు అవగాహన ఏర్పడిందని అన్నారు. కొన్ని క్లిష్టమైన నిబంధనలు అడ్డుగా ఉన్నాయని పేర్కొన్నారు. వాణిజ్య ఒప్పందం గురించి ప్రధాని మోదీ, అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ మధ్య కూడా చర్చలు సాగుతున్నాయి. కేవలం ద్వైపాక్షిక వేదికల్లోనే కాకుండా బహుపాక్షిక వేదికల్లోనూ ఇరువురు నేతలు భేటీలు నిర్వహిస్తున్నారు. ఇటీవల జూన్‌లో జీ7 సదస్సు సందర్భంగా కూడా ఫ్రాన్స్‌లో మోదీ, ట్రంప్ సమావేశమయ్యారు. కీలకమైన రక్షణ, ఇంధనం, వాణిజ్యం వంటి రంగాల్లో పురోగతిని సమీక్షించారు.

**అంతర్జాతీయ పరిణామాలపైనా చర్చలు**

తాజాగా మోదీ– ట్రంప్ ఫోన్ సంభాషణలో కేవలం భారత్– అమెరికా సంబంధాలే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా వివిధ పరిణామాలు కూడా చర్చకు వచ్చాయి. ముఖ్యంగా పలు ప్రాంతాల్లో నెలకొన్న ఉద్రిక్తతలు, భౌగోళిక– రాజకీయ పరిణామాలపై ఇరువురు నేతలు చర్చించారు. ప్రపంచ శాంతి, భద్రత కోసం ఇరు దేశాలు కలిసి పనిచేయాల్సిన ఆవశ్యకతను పునరుద్ఘాటించారు. కొంత కాలంగా పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా ఇక్కడ అమెరికా– ఇరాన్ దాడులు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో మార్చిలోనే ట్రంప్‌తో జరిగిన ఫోన్ కాల్‌లో పశ్చిమాసియా పరిస్థితులపై మోదీ భారత్ వైఖరిని స్పష్టం చేశారు. ఉద్రిక్తతలను తగ్గించి వీలైనంత త్వరగా శాంతిని పునరుద్ధరించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. మరోవైపు ప్రస్తుతం భారత్ అధ్యక్షత వహిస్తున్న బ్రిక్స్ సభ్య దేశమైన ఇరాన్‌కు కూడా ఇదే చెబుతూ వస్తోంది. ఇదొక్కటే కాదు, రష్యా– ఉక్రెయిన్ యుద్ధానికి సంబంధించి కూడా భారత్ ఎప్పటినుంచో శాంతి మంత్రం జపిస్తోంది. ఆగస్టులో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సులోనూ (రాజూ) రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో మోదీ భేటీ అయ్యారు. అప్పుడే ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ముగించాల్సిన సమయం ఆసన్నమైందని, యుద్ధం మానవాళిని వెనక్కి నెడుతోందని వ్యాఖ్యానించారు.

# ఈసీపై ‘ఇండియా’ కూటమి సమరశంఖం..

ఓటరు జాబితా సవరణలో జరిగిన అక్రమాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఆందోళనలకు ఇండియా కూటమి సిద్ధమైంది. ఈ మేరకు దిల్లీలో నిర్వహించిన సమావేశంలో ఉద్యమ కార్యాచరణను ఖరారు చేసింది. యువత, ఎన్జీవోలను కలుపుకుని అక్టోబర్ 2 నుంచి 8 వరకు ప్రజాస్వామ్య పరిరక్షణ యాత్రలు చేపట్టనున్నారు. అలాగే జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేయనున్నారు. అక్టోబర్ 6న విపక్ష ఎంపీలంతా ఎన్నికల సంఘం కార్యాలయం వరకు ర్యాలీగా చేపట్టనున్నారు. అక్టోబర్ రెండో వారంలో ప్రతిపక్ష నేతలంతా రాష్ట్రపతిని కలిసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా వినతిపత్రం సమర్పించనున్నారు. దేశవ్యాప్తంగా 5 భారీ ర్యాలీలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటించారు. వాటి తేదీలు, ప్రదేశాలు త్వరలో ప్రకటిస్తామన్నారు. గతంలో నోట్ బందీ చేసిన ప్రధాని మోదీ, ఇప్పుడు ‘ఓట్ బందీ’ ద్వారా ప్రజల ఓటు హక్కును కాలరాస్తున్నారని ఆరోపించారు. ప్రధాని, హోంమంత్రి ఈ ఓట్ల దొంగతనం వెనుక ఉండి ఎన్నికల సంఘాన్ని పావుగా వాడుకుంటున్నారని ఖర్గే ఆరోపించారు. భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ ఈవీఎంలకు స్వస్తి పలికి బ్యాలెట్ పేపర్లను వాడాలని డిమాండ్ చేశారు. అలాగే సర్‌కు ముందున్న ఓటర్ల జాబితానే పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. సంస్థలను బలహీనపరుస్తున్నారని, ఎన్నికల సంఘం ప్రభుత్వ ప్రభావానికి లోనవుతోందని ఖర్గే ఆరోపించారు. అక్రమ మార్గాల ద్వారా ఎన్నికల్లో గెలుస్తున్నారని, ప్రతిపక్ష పార్టీల ప్రజాస్వామ్య పనితీరుకు ఆటంకం కలిగిస్తున్నారని ఆరోపించారు.

“అక్టోబర్ 2 నుంచి 8 వరకు ఇండియా బ్లాక్ కార్యకర్తలు జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరసనలు చేపడతారు. అక్టోబర్ 6న ప్రతిపక్ష ఎంపీలందరూ కలిసి ఎన్నికల సంఘం వద్దకు పాదయాత్ర చేస్తారు. ప్రతిపక్ష నాయకులు భారత రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోరనున్నారు. అక్టోబర్ రెండోవారంలో మేము వారికి ఒక వినతిపత్రాన్ని సమర్పించనున్నాం. ప్రభుత్వం సృష్టిస్తున్న రాజ్యాంగపరమైన




అడ్డంకులను, మాకున్న ఇబ్బందులను రాష్ట్రపతి దృష్టికి తీసుకువెళ్తాం. ప్రజలను ఇబ్బంది పెడుతూ వ్యవస?థలను నాశనం చేస్తూ వారి సొంత నిర్ణయాలతో నేడు ఈ దొంగల ప్రభుత్వాన్ని నడుపుతున్నారని రాష్ట్రపతికి తెలియజేయాలనుకుంటున్నాం. ఈ విషయంలో మేం ఎంతవరకు విజయం సాధిస్తామనేది తర్వాత చూస్తాం. అక్టోబర్– నవంబర్ నెలల్లో ఐదు ప్రధాన ర్యాలీలు నిర్వహిస్తాం. ఇందుకు సంబంధించిన వేదికలు, తేదీలు త్వరలో ఖరారు చేస్తాం. నవంబర్ 1న దిల్లీలో ఒక ప్రధాన ర్యాలీని నిర్వహిస్తాం.”

ఈ కీలక సమావేశానికి కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున్ ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీలతో పాటు టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ, జమ్మూ కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్, ఎన్సీపీ–ఎస్పీ ఎంపీ సుప్రియా సూలే హాజరయ్యారు. శివసేన–యూబీటీ చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే, ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ తదితరులు ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఇండియా కూటమి నేతలు సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్య నిర్మాణంపై ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా, సీఈసీ జ్ఞానేష్ కుమార్‌లు దాడి చేశారని అన్ని పార్టీలు భావిస్తున్నట్లు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసిన వారికి శిక్షపడేలా చూస్తామని ఆయన హెచ్చరించారు.

మరోవైపు ఈ పరిణామాలను అత్యంత కుంభకోణంతో కూడుకున్న విషయంగా మమతా బెనర్జీ అభివర్ణించారు. జజుజ జ్ఞానేశ్‌కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆయన్ను తొలగించకపోతే ఆందోళనలు ప్రతి మూలకూ విస్తరిస్తామని దీదీ హెచ్చరించారు. ప్రధాని మోదీ సైతం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

“ప్రజల ఓట్లను దోచుకుని, మోసం చేస్తే ఇక ఈ దేశం ఎక్కడికి పోతుంది ఇది మా విన్నపం కాదు, మా డిమాండ్. జ్ఞానేష్ కుమార్‌ను తొలగించకపోతే, ఈ ఆందోళన తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉంది. ఓట్లను దోచుకున్నారు కదా? అసలు ఈవీఎం యంత్రాన్ని ఎందుకు ఉపయోగించారు ఆ శివ ఖన్నా ఎవరు అతను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, అతనికి ఆ సాఫ్ట్‌వేర్ ఎక్కడి నుంచి వచ్చింది ఒక సాఫ్ట్‌వేర్‌ను తయారు చేసి దాని ద్వారా పూర్తిగా దోచుకున్నారు. వారు ఆ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి ఈఆర్‌ఓలను పూర్తిగా స్తంభింపజేశారు. మొత్తం వ్యవస్థను ప్రమాదంలో పడేశారు. సీఈసీ ఆ పదవిలో ఒక్క నిమిషం కూడా కొనసాగే అర్హత లేదు. తక్షణమే రాజీనామా చేయాలి. ఆయనతో పాటు ప్రధాని మోదీ కూడా రాజీనామా చేయాలి.”

మరోవైపు లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సైతం సీఈసీ జ్ఞానేష్ కుమార్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికల ఫలితాలను తారుమారు చేయడానికి ప్రధాని నరేంద్ర మోదీ ఆయనను వాడుకుంటున్నారని ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్? వేదికగా మండిపడ్డారు. దేశంలో జీవితకాల సంపూర్ణ చట్టపరమైన రక్షణను అనుభవిస్తున్న ఏకైక పౌరుడు జ్ఞానేష్ కుమార్ అని కాంగ్రెస్ నాయకుడు ఆరోపించారు.

# ఎన్నికల సంఘం పనితీరుకు నిరసనగా 2న ‘జైల్ భరో’

కేంద్ర ఎన్నికల సంఘం పనితీరు, అది తీసుకున్న నిర్ణయాలపై దేశవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రజాస్వామ్య వ్యవస్థను, రాజ్యాంగ విలువలను దెబ్బతీసేలా ఈసీ వ్యవహరిస్తోందంటూ విపక్షాలు, మండిపడుతున్నాయి. ఈ నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దిప్కే కీలక ప్రకటన చేశారు. ఈసీ పనితీరుకు నిరసనగా అక్టోబర్ 2న గాంధీ జయంతి రోజున ముంబయిలోని చారిత్రక శివాజీ పార్క్ వేదికగా ‘జైల్ భరో ఆందోళన్’ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ ఆందోళనలో అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బుధవారం ముంబయిలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) దుర్వినియోగంపై ఎన్‌సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ చేసిన వ్యాఖ్యలను దీప్కే సమర్థించారు. దేశంలో ఎన్నికల సంఘం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని దిప్కే పేర్కొన్నారు. ఈసీ నియంతృత్వ పోకడలు ఆందోళనకరంగా మారాయన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లు, ఈసీ పనితీరుపై కొన్ని సంవత్సరాలుగా అనుమానాలు వ్యక్తమవుతున్నా సరైన పరిష్కార మార్గం చూపడంలో ఈసీ విఫలమైందని విమర్శించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని ఇప్పటికే సీజేపీ అల్టిమేటం జారీ చేసింది. ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని, జనవరి 2025 నాటి ఓటర్ల జాబితాను యథావిధిగా పునరుద్ధరించాలని డిమాండ్ చేసింది. అంతేకాకుండా, 2023లో ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించి తీసుకొచ్చిన చట్టాన్ని రద్దు చేయాలని సీజేపీ డిమాండ్ చేస్తోంది. ఈ డిమాండ్లను సాధించేందుకు సీజేపీ



మరో ఉద్యోమానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే జైల్ భరో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, గాంధీ జయంతి రోజున ఈ నిరసన కార్యక్రమం నిర్వహించేందుకు ముంబై పోలీసులు అనుమతి నిరాకరించారు. పోలీసులు అనుమతి ఇవ్వకపోయినా ‘జైల్ భరో ఆందోళన్’ చేపట్టి తీరుతామని దిప్కే తేల్చిచెప్పారు. పౌరుల గొంతును అణచివేయాలని చూస్తే ప్రజాగ్రహాన్ని చూడాల్సి వస్తుందని దీప్కే హెచ్చరించారు.

**బైకుల్లా– బీఎంసీ ప్రధాన కార్యాలయం వరకు ప్రదర్శన**

ఇదిలా ఉండగా, ఎన్నికల సంఘం ఏకపక్ష విధానాలకు వ్యతిరేకంగా అక్టోబర్ 4న ముంబయిలో భారీ కవాతను నిర్వహించనున్నట్లు మహారాష్ట్ర నవనిర్మాణ సేన అధినేత రాజ్ ఠాక్రే, శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే వెల్లడించారు. బైకల్లాలోని రిచర్డ్సన్ క్రుడాస్ వద్ద ఉదయం ప్రారంభమై, బీఎంసీ ప్రధాన కార్యాలయం వరకు కొనసాగుతుందని వెల్లడించారు. ఈవీఎం, ఎన్నికల కమిషన్ పనితీరుపై తమ పార్టీ చాలా సంవత్సరాలుగా ప్రశ్నలు లేవనెత్తుతోందని, అయితే ఇంతవరకు ఎలాంటి పరిష్కారం లభించలేదని ఇరువురు నేతలు ప్రకటించారు. ఈ నిరసన ప్రదర్శనలో ఎలాంటి పార్టీ జెండాలను వాడకుండా త్రివర్ణ పతాకాన్ని మాత్రమే చేతబూని పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ పోరాటం ఏ ఒక్క పార్టీకో పరిమితమైనది కాదని, దేశ ప్రజల హక్కులను కాపాడుకోవడంసానికోసం ప్రతి ఒక్కరూ రాజకీయాలకు అతీతంగా కదలిరావాలని రాజ్ ఠాక్రే పిలుపునిచ్చారు. ఇదే సమయంలో అభిజిత్ దిప్కే తలపెట్టిన ‘జైల్ భరో’ ఉద్యమానికి తమ పార్టీ తరపున సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఆయన ప్రకటించారు. కాగా, ఎస్ఐఆర్ ప్రక్రియ గురించి కొద్దిరోజుల క్రితం సీజేపీ కీలక హెచ్చరిక జారీ చేసింది. సీఈసీ జ్ఞానేశ్? కుమార్? రాజీనామా చేయకుంటే జంతర్? మంతర్? వద్ద మరోసారి నిరసన కార్యక్రమం చేపడతామని తెలిపింది. త్వరలో జరగనున్న అన్ని అసెంబ్లీ ఎన్నికలను నిలిపివేయాలని డిమాండ్? చేసింది. ‘సర్’ను నిలిపివేసి 2025 ఓటర్ల జాబితానే పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది. సర్‌కు సంబంధించిన ఫైళ్లన్నింటినీ సుప్రీంకోర్టు నియమించిన కమిటీ ఆధీనంలో ఉంచాలని కోరింది.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

చెడు వ్యసనాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : సీఐ రామకృష్ణారెడ్డి




**నడిగూడెం శుభోదయ డైనమిక్ వార్త సెప్టెంబర్ 30** నడిగూడెం: విద్యార్థులు చెడు వ్యసనాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని, వాటిని సాధించే దిశగా ముందుకు సాగాలని మునగాల సీఐ రామకృష్ణారెడ్డి అన్నారు.

బుధవారం నడిగూడెం కేఎల్ఎన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీస్ శాఖ, జాతీయ సేవా పథకం యూనిట్–1, 2 ఆధ్వర్యంలో నిర్వహించిన సైబర్ నేరాలపై అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. సైబర్ నేరాల నివారణతో పాటు మాదకద్రవ్యాల నిర్మూలనలో విద్యార్థులు భాగస్వాములు కావాలని, డ్రగ్స్ రహిత, నేర రహిత సమాజ నిర్మాణానికి తమ వంతు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నడిగూడెం ఎస్సై తేజస్విని, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ కర్నాటి శ్రీధర్, అధ్యాపకులు సీహెచ్. కృష్ణ, బి. మహేష్, ఉపేందర్, జాతీయ సేవా పథకం యూనిట్ అధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొలిసారిగా కళాశాలకు విచ్చేసిన సీఐ రామకృష్ణారెడ్డిని అధ్యాపకులు ఘనంగా సత్కరించారు

## ఘనంగా బతుకమ్మ సంబరాలు





**నడిగూడెం,శుభోదయ డైనమిక్** నడిగూడెంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో పీఎం శ్రీ కార్యక్రమంలో భాగంగా బుధవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు, ఉపాధ్యాయులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చింతలపాటి వాణి మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. బతుకమ్మ పండుగ విశిష్టత, ఆచారాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో విద్యార్థినులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రబీ పంటల కనీస మద్దతు ధరలు పెంపు

ఎల్‌నినో ప్రతికూల పరిస్థితుల్లో అన్నదాతలకు అండగా నిలుస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రబీ పంటల కనీస మద్దతు ధరను పెంచుతూ ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. రైతులు పండించిన పంటల ఉత్పత్తి వ్యయంపై కనీసం 50శాతం అదనపు లాభం చేకూరేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. తాజా నిర్ణయంతో 2027–28 సీజన్‌కు క్వింటా గోధుమల ధర 25 రూపాయల మేర పెరిగి 2వేల 610 రూపాయలకు చేరింది. “గోధుమల ఉత్పత్తి వ్యయం క్వింటాలుకు రూ. 1,264గా ఉండగా, 2027–28 సంవత్సరానికి మీస్రాని దానికి రెట్టింపు కంటే ఎక్కువగా, అంటే క్వింటాలుకు రూ. 2,610గా నిర్ణయించాం. అలాగే, బార్లీ మీస్రాని 2026–27లో ఉన్న క్వింటాలుకు రూ. 2,150 నుంచి, 2027–28 రబీ మార్కెటింగ్ సంవత్సరానికి క్వింటాలుకు రూ. 2,286కి పెంచాం. ఇక, పప్పుధాన్యాల విషయానికొస్తే, శనగల మద్దతు ధర క్వింటాలుకు రూ. 5,875 నుంచి రూ. 83 పెరిగి రూ. 5,958కి చేరింది. అదే సమయంలో మసూర్ పప్పు మీస్రా క్వింటాలుకు రూ. 390 పెరిగి రూ. 7,390కి చేరింది.” ఇక, నూనె గింజల విషయానికొస్తే ఆవాల మద్దతు ధర క్వింటాలుకు రూ. 6,200 నుంచి రూ. 413 పెరిగి రూ. 6,613కి చేరిందని అశ్వినీ వైష్ణవ్? పేర్కొన్నారు. అలాగే కుసుమల (ఝటటశ్రీశీషవతీ) ధర గత ఏడాది ఉన్న క్వింటాలుకు రూ. 6,540 నుంచి రూ. 675 పెరిగి రూ. 7,215కి చేరిందన్నారు. 2027–28 మార్కెటింగ్ సంవత్సరంలో 324 లక్షల టన్నుల ధాన్యానికి సంబంధించి రైతులకు చెల్లించే మొత్తం విలువ రూ. 90,962 కోట్లుగా ఉంటుందని ఆయన అంచనా వేశారు. వ్యవసాయ ఖర్చులు, ధరల కమిషన్ సిఫార్సుల ఆధారంగా, ఉత్పత్తి వ్యయం, ‘ఎల్ నినో’ ప్రభావంపై ఆందోళనలు, అలాగే అంతర్జాతీయ, దేశీయ ధరల పోకడలను పరిగణనలోకి తీసుకుని ఆరు రకాల రబీ పంటలకు కనీస మద్దతు ధర (మీస్రా)ను వ్యవసాయ శాఖ ప్రతిపాదించింది. 2026–27 పంట సంవత్సరానికి (జులై–జూన్) గోధుమల ఉత్పత్తి లక్ష్యాన్ని వ్యవసాయ శాఖ 121 మిలియన్ టన్నులుగా నిర్దేశించింది. గోధుమ అనేది ప్రధాన రబీ (శీతాకాలపు) పంట. సాధారణంగా అక్టోబర్‌లో విత్తనాలు చల్లడం, ఏప్రిల్‌లో పంట కోత ప్రారంభమవుతాయి.

**దిల్లీలో ట్రాఫిక్ కష్టాలకు చెక్**

ఇక దిల్లీలో ట్రాఫిక్ కష్టాలను తెరదించేందుకు ఏఐ ఆధారిత ఇంటెలిజెంట్ ట్రాఫిక్ నిర్వహణ సిస్టమ్‌ను అమల్లోకి తేనున్నట్లు అశ్విని వైష్ణవ్ వివరించారు. రూ. 1,789.52 కోట్ల అంచనా వ్యయంతో దిల్లీ పోలీసులు ప్రతిపాదించిన ఐటీఎంఎస్ ప్రాజెక్టును అమలుకు ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్ట్ 42 గుర్తించిన ట్రాఫిక్ కారిడార్లను కవర్ చేస్తుంది. దీనిని 24 నెలల వ్యవధిలో మూడు దశల్లో అమలు చేస్తారు, ఆ తర్వాత ఐదేళ్లపాటు ఆపరేషన్, నిర్వహణ ఉంటుంది. దేశంలో కొత్త క్రిమినల్ చట్టం దీచీూా అమల్లోకి వచ్చాక కేసుల విచారణ అనూహ్యంగా వేగవంతమైందని తెలిపారు. ఇటీవల ఓ హత్య కేసులో కేవలం ఎనిమిది రోజుల్లోనే న్యాయస్థానం తీర్పు వెలువరించడం ఈ చట్టం పటిష్టతకు నిదర్శనమని స్పష్టం చేశారు.

**గ్రీన్ ఎనర్జీ కారిడార్ మూడో దశకు కేబినెట్ ఆమోదం**

దేశంలో పునరుత్పాదక ఇంధన రంగాన్ని పరుగులు పెట్టించేందుకు ఏకంగా లక్షా 86 వేలకోట్లతో గ్రీన్ ఎనర్జీ కారిడార్ మూడో దశకు కేబినెట్ మార్గం సుగమం చేసింది. 2030 నాటికి 500 +ఔ పునరుత్పాదక శక్తి సామర్థ్యాన్ని సాధించాలనే భారతదేశ లక్ష్యానికి ఇది ఎంతో కీలకంగా మారనుంది. దీని వల్ల దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల మధ్య 135 +ఔ వరకు పునరుత్పాదక శక్తిని తరలించడానికి వీలుగా రాష్ట్ర–స్థాయి విద్యుత్ ప్రసార వ్యవస్థను (×ఊూూ) బలోపేతం చేస్తుంది. పీఎం ధార కింద గ్రిడ్, స్మార్ట్‌గ్రిడ్ మౌలికసదుపాయాల్ని మెరుగుపర్చడంతోపాటు అత్యాధునిక బ్యాటరీ స్టోరేజ్ సిస్టమ్ ద్వారా ఇంధన సరఫరాకు చర్యలు చేపట్టనున్నారు.

## రష్యా సైన్యంలో చేరొద్దు..
## అది చాలా ప్రమాదకరం!

రష్యా సైన్యంలో చేరడం అత్యంత ప్రమాదకరమని, అటువంటి నిర్ణయాలు తీసుకోవద్దని భారత ప్రభుత్వం తన పౌరులను మరోసారి గట్టిగా హెచ్చరించింది. ఉక్రెయిన్‌తో యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో, ఆర్థిక ప్రయోజనాల కోసం ప్రాణాలను పణంగా పెట్టవద్దని సూచించింది. ఈ మేరకు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ బుధవారం ఒక ప్రకటన

# హుజూర్‌నగర్ ప్రజాసేవకు రఘుకు గౌరవం




**హైదరాబాద్, శుభోదయ డైనమిక్** హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ప్రజాసేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, ఓజో ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘుకు ఢిల్లీలో యూనివర్సల్ హానరరీ అవార్డు కౌన్సిల్ ఆధ్వర్యంలో గౌరవ డాక్టరేట్ అవార్డు అందజేశారు.స్వగ్రామ అభివృద్ధికి సొంత నిధులతో సేవా కార్యక్రమాలు చేపట్టడంతో పాటు, గత ఆరు సంవత్సరాలుగా నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పేదలు, విద్యార్థులు, రైతులు, యువత, ఆపదలో ఉన్న కుటుంబాలకు తనవంతు సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు కోచింగ్, పేద కుటుంబాల వివాహాలకు సహాయం, పాఠశాలలు, దేవాలయాలు, చర్చిలు, మసీదులకు సైతం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్ అందించడం పట్ల రఘు అభిమానులు, అనుచరులు హర్షం వ్యక్తం చేశారు.

# హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ వార్షిక తనిఖీ



**హుజూర్‌నగర్,శుభోదయ డైనమిక్** హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌ను కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి వార్షికంగా తనిఖీ చేశారు. సీఐతో కలిసి రికార్డులు, పెండింగ్ కేసులు, సిబ్బంది పనితీరు, స్టేషన్ నిర్వహణను పరిశీలించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, ఆధారాల సేకరణతో నిర్ణీత సమయంలో చార్జిషీట్లు దాఖలు చేయాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు సున్నిత ప్రాంతాలపై నిఘా, పెట్రోలింగ్, బీట్ వ్యవస్థను బలోపేతం చేయాలని ఆదేశించారు. ప్రజల ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని, మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని డీఎస్పీ కోరారు.

# 100 పడకల ఆసుపత్రి మంజూరు బీఆర్ఎస్‌దే: బొల్లం



**కోదాడ, శుభోదయ డైనమిక్** కోదాడలో 100 పడకల ప్రభుత్వాసుపత్రికి రూ.26 కోట్ల నిధులు, జీవో నంబర్ 442ను 2023లో బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిందని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. కోదాడలోని 30 పడకల ప్రభుత్వాసుపత్రిని సందర్శించిన ఆయన, జీవో నంబర్ 442 వివరాలతో ఉన్న టీషర్ట్ ధరించి నిరసన తెలిపారు.ఆసుపత్రిని 100 పడకలకు అప్‌గ్రేడ్ చేయించేందుకు నాటి సీఎం కేసీఆర్ సహకారంతో నిధులు మంజూరు చేయించామని తెలిపారు. ప్రస్తుతం పనులు నత్తనడకన సాగుతున్నాయని, కాంట్రాక్టులు, కమిషన్ల కారణంగానే జాప్యం జరుగుతోందని ఆయన ఆరోపించారు.తన హయాంలో ఏర్పాటు చేసిన ఐదు పడకల డయాలసిస్ కేంద్రం ప్రస్తుతం సక్రమంగా పనిచేయడం లేదని, ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన జీవో, నిధులపై ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలని కోరారు. ఆసుపత్రి పనులను త్వరగా పూర్తి చేయాలని బొల్లం మల్లయ్య యాదవ్ డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డికి శుభాకాంక్షలు



**కోదాడ, శుభోదయ డైనమిక్** నల్గొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.ఉస్మానియా విశ్వవిద్యాలయంలో గోల్డ్ మెడల్ సాధించిన ఆయన విద్యా, వృత్తిపరమైన అనుభవంతో పట్టభద్రులు, నిరుద్యోగ యువత, విద్యా రంగం, రైతాంగం, ప్రాంతీయ సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించాలని ఆకాంక్షించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి నాయకత్వంలో ప్రజా సమస్యలకు ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగాలని కోరారు.

# సర్పంచ్ చలసాని మంజుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా పోషణ్ మాసోత్సవాలు

స్థానిక ఆహార పదార్థాలతో రక్తహీనతను తగ్గించాలి

కల్లూరులో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం



**నేరేడుచర్ల, శుభోదయ డైనమిక్** మండలంలోని కల్లూరు గ్రామంలో ముజఫర్‌నగర్ ప్రాజెక్టు, పెంచికల్‌దిన్నె సెక్టార్ ఆధ్వర్యంలో 9వ రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ చలసాని మంజుల శ్రీనివాస్ మాట్లాడుతూ స్థానికంగా లభించే సాంప్రదాయ ఆహార పదార్థాలను రోజువారీ ఆహారంలో భాగంగా చేసుకోవాలని సూచించారు.చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, పప్పులు వంటి పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా పిల్లలు, గర్భిణీలు, బాలింతల్లో రక్తహీనతను తగ్గించవచ్చని తెలిపారు. అనంతరం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి నర్సింహారావు, సీడీపీఓ పడమట పార్వతి, సూపర్‌వైజర్లు ఎ. యశోద, రాజ్యలక్ష్మి, వైద్యాధికారి సీతామహాలక్ష్మి, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యలపై బీజేపీ ధర్నా



**నేరేడుచర్ల,శుభోదయ డైనమిక్** రైతులకు నిరంతరాయంగా త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు కొనతం నాగిరెడ్డి, చింతకుంట్ల రాజేష్ రెడ్డి ఆధ్వర్యంలో నేరేడుచర్ల విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు.విద్యుత్ అంతరాయాలతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యపై స్పందించిన విద్యుత్ శాఖ ఏఈ రైతుల ఇబ్బందులను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో జిల్లా నాయకులు తాళ్ల నరేందర్ రెడ్డి, సంకలమద్ది సత్యనారాయణ రెడ్డి, ఆకుల జాతయ్య గౌడ్, ఏమిరెడ్డి శంకర్ రెడ్డి, కొప్పు లక్ష్మీనారాయణ, జూలూరి అశోక్, నందిపాటి హిందూజా, ఉరిమల్ల రామూర్తి, సీనియర్ నాయకులు బాల వెంకటేశ్వర్లు, బైరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మండల, పట్టణ నాయకులు, పాలకవీడు మండల అధ్యక్షులు నర్రి నాయక్, కిసాన్ మోర్చా అధ్యక్షులు తాటికొండ పరమేష్ రెడ్డి, కాలం నాగయ్య, కాంపెల్లి నారాయణ రెడ్డి, కాలం శైలజ, మల్గి రెడ్డి రఘు, దేవిరెడ్డి, నాగిరెడ్డి, బుస్సా విమల తదితరులు పాల్గొన్నారు.

# నేరేడుచర్లలో ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం



**నేరేడుచర్ల,శుభోదయ డైనమిక్** ఓటరు జాబితా, ఎన్నికల వ్యవస్థకు సంబంధించిన అంశాలపై ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నేరేడుచర్లలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కొణతం చిన వెంకటరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిర్ణయాలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఓటు హక్కు అర్హులైన ప్రతి ఒక్కరికీ కల్పించాలని, ఓటర్ల తొలగింపులు, ఎస్ఐఆర్, ఫామ్-6 నిబంధనలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు, మేధావులు ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ధూళిపాళ ధనుంజయ నాయుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ నూకల సందీప్ రెడ్డి, మాజీ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశం, తాళ్ల సురేష్ రెడ్డి, కత్తి శ్రీనివాసరెడ్డి, కొదమగుడ్ల నగేష్, ఇంజమూరి వెంకటయ్య, అమరారపు పున్నయ్య, యడవల్లి అరుణ్, రాచకొండ అజయ్, కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# సఫాయి మిత్రలకు ఆరోగ్య శిబిరం



**నేరేడుచర్ల, శుభోదయ డైనమిక్** నేరేడుచర్ల మున్సిపాలిటీలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా "సఫాయి మిత్ర సురక్షా ఏవం సమ్మాన్" కార్యక్రమం నిర్వహించారు. పారిశుద్ధ్య కార్మికులకు ప్రత్యేక ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్ పున్న నాగిని . ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొణతం వెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ నూకల సందీప్ రెడ్డి,కమిషనర్ నాగరాజు,కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు. సఫాయి మిత్రల సేవలను అభినందిస్తూ వారి ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.

# 9వ పోషణ మాసం కార్యక్రమం



**శుభోదయ డైనమిక్ న్యూస్ మునగాల సెప్టెంబర్ 30** మునగాల మండల కేంద్రము లో వాసవి భవన్ లో 9వ పోషణ మాసం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సామూహిక సీమంతాలు . అన్న ప్రసన్న. అక్షరాభ్యాసం కార్యక్రమలు నిర్వహించారు. ఈ ఈ సందర్భంగా మునగాల సర్పంచ్ నల్లపాటి ప్రమీల శ్రీనివాస్.మాట్లాడుతూ.. పోషకాహార లోపాన్ని ఏ విధంగా మనం తగ్గించు కోవాలి అని గర్భిణీలు, బాలింతలు చిన్న పిల్లలకు ఎలాంటి పోషకాహారం ఇవ్వాలి అనే విషయం గురించి. ఆమె అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సరిత. ఎంపీడీవో రమేష్ దీన్ దయాల్. కోదాడ సిడిపిఓ సత్యనారాయణ. బీసీ కోఆర్డినేటర్ ఫరీద్. మునగాల సూపర్వైజర్ శ్రీలత. మాదారం సూపర్వైజర్ సూర్య కళ. ఏఎన్ఎం వీరమ్మ.అంగన్వాడి టీచర్లు.ఆశాలు. గర్భిణీలు బాలింతలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు..

# దాచారంలో చింతకుంట్ల భిక్షం రెడ్డి విగ్రహావిష్కరణ

గ్రామాభివృద్ధి, రైతుల సంక్షేమానికి నిస్వార్థ సేవలు : కొణతం చిన వెంకటరెడ్డి

సీనియర్ నాయకుల అనుభవం, సూచనలు పార్టీకి ఎంతో అవసరం



**నేరేడుచర్ల, శుభోదయ డైనమిక్ వార్త** నేరేడుచర్ల మండలం దాచారం గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు స్వర్గీయ చింతకుంట్ల భిక్షం రెడ్డి విగ్రహాన్ని గ్రామ నడికూడలిలో ఆయన కుటుంబ సభ్యులు ఏర్పాటు చేశారు. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ కొణతం చిన వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కొణతం చిన వెంకటరెడ్డి మాట్లాడుతూ.. చింతకుంట్ల భిక్షం రెడ్డి గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా, సింగిల్ విండో చైర్మన్‌గా గ్రామ ప్రజలకు, రైతాంగానికి నిస్వార్థ సేవలు అందించారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు చివరి శ్వాస వరకు పార్టీలో కొనసాగడం ఆయన నిబద్ధతకు నిదర్శనమన్నారు.సీనియర్ నాయకుల అనుభవం, సూచనలు గ్రామ ప్రజలకు, పార్టీకి ఎంతో అవసరమని పేర్కొన్నారు. భిక్షం రెడ్డి మరణం తీవ్ర బాధకు గురిచేసిందని, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఆయన జ్ఞాపకార్థం విగ్రహాన్ని ఏర్పాటు చేసిన కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

**కార్యక్రమంలో పాల్గొన్న వారు**

గ్రామ సర్పంచ్ చింతకుంట్ల వీరారెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పేర్వాల రంగారెడ్డి, అనిరెడ్డి మధుసూదన్ రెడ్డి, కొండేటి అరవింద్ రెడ్డి, నూకల భిక్షం రెడ్డి, కేసిడి నర్సిరెడ్డి, సంతోష్ రెడ్డి, మందడి వెంకటరెడ్డి, మందడి అశోక్ రెడ్డి, ఎస్.కె. సైదులు, కోట వీరస్వామి, పగిడి అశోక్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# హాజరు తగ్గితే చర్యలు తప్పవు: కలెక్టర్



**సూర్యాపేట బ్యూరో, శుభోదయ డైనమిక్** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో విద్యాశాఖ సెప్టెంబర్ మాస సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో విద్యార్థుల సగటు హాజరు 69 శాతంగా ఉండటంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. 60 శాతంలోపు హాజరు ఉన్న పాఠశాలల హెచ్‌ఎంలకు నోటీసులు జారీ చేసి వివరణ తీసుకోవాలని ఆదేశించారు. నెలలో 15 రోజులకు తక్కువ ఎఫ్ఆర్ఎస్ హాజరు ఉన్న ఉపాధ్యాయుల నుంచి వివరణ తీసుకోవాలని, వరుసగా మూడు నెలలు నిబంధనలు పాటించకుంటే రెండు ఇంక్రిమెంట్లు నిలిపివేస్తామని హెచ్చరించారు. అక్టోబర్ 1 నుంచి జరిగే సమ్మేటివ్ పరీక్షల ఫలితాలపై ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ హరి సింగ్, విద్యాశాఖ అధికారులు, ఎంఈవోలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

# అనాధ ఆశ్రమంలో అన్నదానం



**నేరేడుచర్ల,శుభోదయ డైనమిక్** కోదాడలోని శనిగల రాధాకృష్ణ అమ్మానాన్న అనాధ ఆశ్రమంలో ఆర్టీఐ కార్యకర్త, జర్నలిస్ట్, నేరేడుచర్ల మండల ఆర్టీఐ అధ్యక్షులు మిడిసినమెట్ల సతీష్ తన సోదరుడు వేణుతో కలిసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ యువత మానవసేవే మాధవసేవ అనే భావనతో సామాజిక సేవలో పాల్గొనాలని కోరారు. పుట్టినరోజులు, ఇతర వేడుకలను అనాధ ఆశ్రమాల్లో నిర్వహించి పేదలకు అండగా నిలవాలని సూచించారు. ఆశ్రమాల అభివృద్ధికి ప్రభుత్వం సహకరించి మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. అన్నదానం చేసిన సతీష్ కుటుంబ సభ్యులకు ఆశ్రమ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ ముక్కంటికి సన్మానం



**శుభోదయ డైనమిక్ -- హుజూర్‌నగర్** ఎమ్మార్పీఎస్ సూర్యాపేట జిల్లా ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టిన మేళ్లచెరువు ముక్కంటిని హుజూర్‌నగర్ ఐఎన్‌టీయూసీ మిల్లు డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు సలిగంటి జానయ్య ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా జానయ్య మాట్లాడుతూ కుల సంఘాలను బలోపేతం చేసేందుకు ఐక్యంగా పనిచేసి ప్రజా సమస్యలపై పోరాడాలని కోరారు.ముక్కంటి మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జాతీయ, రాష్ట్ర, జిల్లా కార్యవర్గాలకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో నియోజకవర్గ, మండల, గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

## ఎస్‌కే సైదులు పెద్దకర్మ సందర్భంగా బియ్యం అందజేత



**శుభోదయ డైనమిక్, నడి గూడెం** ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఎస్‌కే సైదులు పెద్దకర్మ సందర్భంగా జయ సీతారామ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులకు సహాయం అందించారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వల్లెపు శ్రావణి శ్రీనివాస్ ఆధ్వర్యంలో 25 కేజీల బియ్యాన్ని సైదులు కుటుంబ సభ్యుడు రఫీకి అందజేశారు.ఈ కార్యక్రమంలో వంశీ, పల్లపు తిరుమలేష్, దేవరంగుల రాము, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## పల్లె వెలుగు బస్సులో నగలు చోరీ.



**డైనమిక్ న్యూస్ హుజూర్ నగర్:** హుజూర్నగర్ పట్టణానికి చెందిన తౌలుపులూరి పద్మావతి మరియు ఆమె భర్త ప్రకాష్ రావు ఇరువురు కోదాడ వెళ్లి కరూర్ వైశ్య బ్యాంకులో వారికి ఉన్న లాకర్ నుండి బంగారు వస్తువులు తీసుకుని వాటిని బాక్సులలో పెట్టుకొని అట్టి బాక్సులను చేతిలోని సంచిలో పెట్టుకొని రంగా థియేటర్ వద్ద మధ్యాహ్నం 12 గంటల సమయంలో పల్లె వెలుగు బస్సు ఎక్కి హుజూర్నగర్ లోని పాత బస్టాండ్ వద్ద మధ్యాహ్నం 12 గంటల 45 నిమిషాల సమయంలో దిగి సంచి చూసుకోగా అట్టి సంచిని రెండు వైపులా కత్తిరించి ఎవరో గుర్తుతెలియని దొంగలు బస్సులో బంగారు వస్తువులు ఉన్నటువంటి రెండు బాక్సులను దొంగిలించినారు అని ఫిర్యాదురాలు దరఖాస్తు ఇవ్వగా హుజూర్నగర్ ఎస్సై సిహెచ్ నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేయుచున్నారు. దొంగిలించబడిన వస్తువులు సుమారు 15 తులాలు ఉన్నాయి అని సమాచారం.

## హుస్సైనాబాద్ సమీపంలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా

ముగ్గురికి గాయాలు -- సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు




**మోతె, శుభోదయ డైనమిక్** మోతె మండలం హుస్సైనాబాద్ గ్రామ శివారులో బుధవారం ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రమాదానికి గురైంది. హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న మైత్రి ట్రావెల్స్‌కు చెందిన చీూ 01 దీ 5579 నంబర్ గల బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతివేగంగా నడపడంతో అదుపుతప్పి రహదారి పక్కకు దూసుకెళ్లి, హుస్సైనాబాద్ గ్రామ శివారులోని న్యూ పెట్రోల్ బంక్ ఎదురుగా బోల్తా పడింది.ప్రమాద సమయంలో బస్సులో సుమారు 36 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనలో ముగ్గురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు, అధికారులు క్షతగాత్రులను అంబులెన్స్ ద్వారా సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.ప్రమాదానికి డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని ప్రాథమికంగా తెలుస్తోంది. ఘటనపై మోతే ఎస్సై బి లచ్చిరెడ్డి వివరాలు సేకరిస్తూ దర్యాప్తు చేస్తున్నారు.

## డిగ్రీ విద్యార్థులకు గణిత పుస్తకం ఉపయోగకరం



**శుభోదయ డైనమిక్ -- హుజూర్‌నగర్ రూరల్** అమరవరం గ్రామానికి చెందిన డాక్టర్ కొప్పుల స్వాతి రచించిన 'డిఫరెన్షియల్ ఈక్వేషన్స్ (అవకలన సమీకరణాలు)' పుస్తకాన్ని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ గణిత విద్యార్థులకు పుస్తకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ప్రభుత్వ కళాశాలల పేద విద్యార్థులకు మేలు చేకూరుతుందని అన్నారు. అధ్యాపకులు బోధనతో పాటు పరిశోధనపై దృష్టి సారించాలని సూచించారు.కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికా యుగంధర్‌రావు, మాజీ ఉన్నత విద్యామండలి సభ్యులు ఒంటెద్దు నర్సింహారెడ్డి, కొప్పుల సైదిరెడ్డి, క్రిష్టిపాటి అంజిరెడ్డి, ఆకారపు శ్రీనివాసచారి, కొప్పుల బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బూరుగడ్డలో ఘనంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**శుభోదయ డైనమిక్ -- హుజూర్‌నగర్** రూరల్ బూరుగడ్డ గ్రామ పంచాయతీలో సర్పంచ్ యరగాని రాధనాగరాజు ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. మార్కెట్ కమిటీ చైర్మన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు రాధిక అరుణ్ కుమార్ దేశ్‌ముఖ్, మాజీ ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై లబ్ధిదారులకు కార్డులు అందజేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డులు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వారు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గడ్డం నాగయ్య, రేషన్ డీలర్ రాగం లింగయ్య, వార్డు సభ్యులు, నాయకులు, గ్రామ పెద్దలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## బూరుగడ్డ పీఏసీఎస్‌లో సర్వసభ్య సమావేశం



**శుభోదయ డైనమిక్ , హుజూర్‌నగర్ రూరల్** బూరుగడ్డ పీఏసీఎస్‌లో చైర్మన్ మేకపోతుల వెంకన్న గౌడ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సొసైటీ అభివృద్ధి, రైతులకు అందుతున్న సేవలు, వ్యవసాయ సమస్యలపై చర్చించారు. రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సభ్యులు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ యరగాని రాధా నాగరాజు, దేవాలయ చైర్మన్ ఎరగని బిక్షం, డైరెక్టర్లు బత్తిని గోపయ్య, పిల్లుట్ల వీరయ్య, రైతులు, సభ్యులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీ వెంకట సాయి పారా మెడికల్ కళాశాలలో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం



**శుభోదయ డైనమిక్ న్యూస్, సెప్టెంబర్ 30, సూర్యాపేట** :పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట ట్రాఫిక్ పోలీసులు శ్రీ లక్ష్మీ వెంకట సాయి పారా మెడికల్ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం, వాహనాలు నడిపేటప్పుడు మొబైల్ ఫోన్ వినియోగించకపోవడం, మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని ట్రాఫిక్ పోలీసులు సూచించారు.

## అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు: ములకలపల్లి రాములు



**కోదాడ, శుభోదయ డైనమిక్** హైదరాబాద్‌లో శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తున్న అఖిలపక్ష నాయకులను పోలీసులు అరెస్టు చేయడం, మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మిని ఈడ్చుకెళ్లడాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ములకలపల్లి రాములు ఖండించారు. పోలీసుల చర్యలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.కోదాడలో జరిగిన సీపీఎం పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మేదరమట్ల వెంకటేశ్వరరావు, ఎస్కే సైదా, కోటగిరి వెంకటనారాయణ, జుట్టుకొండ బసవయ్య, ఎం. ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.ం

## పేదలకు అండగా సీఎం సహాయ నిధి



**శుభోదయ డైనమిక్ న్యూస్ హుజూర్‌నగర్ రూరల్** బూరుగడ్డ గ్రామ పంచాయతీలో సీఎం సహాయ నిధి కింద మంజూరైన రూ.3 లక్షల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సర్పంచ్ యరగాని రాధానాగరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు రాధిక అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, మాజీ ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ పాల్గొని చెక్కులు అందజేశారు. పేదల వైద్య ఖర్చులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని వారు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గడ్డం నాగయ్య, కార్యదర్శి పద్మ, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## హుజూర్‌నగర్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**శుభోదయ డైనమిక్ , హుజూర్‌నగర్**, మంత్రి కెప్టెన్ నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో మంజూరైన సీఎం సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను బుధవారం హుజూర్‌నగర్‌లో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, కౌన్సిలర్లు, బూత్ అధ్యక్షులు, సీనియర్ నాయకుల చేతుల మీదుగా చెక్కులు అందజేశారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ సహాయం ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన ఈడ్పుగంటి మోహన్



**శుభోదయ డైనమిక్ న్యూస్ -- హుజూర్‌నగర్**తెలంగాణ సీఎం ఎ. రేవంత్‌రెడ్డిని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థులు సామ రామ్మోహన్‌రెడ్డి, సర్వోత్తమ్‌రెడ్డి, ఐనాల గీత, రాకేష్ చౌదరిలతో కలిసి ఈడ్పుగంటి మోహన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పట్టభద్రుల సమస్యలు, విద్యా రంగం, యువతకు ఉపాధి అవకాశాలు, ఎమ్మెల్సీ ఎన్నికల అంశాలపై చర్చించినట్లు తెలిపారు.

## 'విల్లు-బాణం' గుర్తుకు మద్దతివ్వండి



**శుభోదయ డైనమిక్ -- హుజూర్‌నగర్** అక్టోబర్ 9న జరిగే టీజీఎస్‌ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ 'విల్లు-బాణం' గుర్తుకు మద్దతు ఇవ్వాలని జాతీయ ఐఎన్‌టీయూసీ అధ్యక్షులు డాక్టర్ జి. సంజీవరెడ్డి పిలుపునిచ్చారు. కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రతతో పాటు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ కోసం యూనియన్ పోరాడుతోందన్నారు. 'విల్లు-బాణం' గుర్తుకు ఓటు వేసి మద్దతు ఇవ్వాలని కోరారు. ఎన్నికలు రహస్య బ్యాలెట్ విధానంలో జరగనున్నాయి.

EDITOR & PUBLISHER : PARVATHAM PARAMESH, PLACE OF PUBLICATION : 4-68, LAL LAXMI PURAM, KALLURU, MEDARAM NEREDCHARLA RAOD, SURYAPET,TELANGANA - 508218.
PRINTER : LAXMI NARAYANA KARNATI, RATNA GRAPHICS, PRINTING PRESS (NAME & ADDRESS) 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPPOSITE POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013. TGTEL/26/A2416, SHUBODHAYA DYNAMIC VAARTA